# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 18-12-2024 సమయం : 1.20 గంటలు

---

# ముఖ్యాంశాలు

1. **రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఈరోజు విశాఖపట్నంలో ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను జాతికి అంకితం చేస్తారు.**

2. **రాష్ట్రంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా జల్‌జీవన్ మిషన్‌ను మరింత బలోపేతం చేస్తామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వెల్లడించారు.**

3. **విదేశాలకు వెళ్ళేవారు దళారుల వలన మోసపోవద్దని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.**

4. **శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం మరో రెండు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతోంది.**

5. **ఈరోజు మైనారిటీ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. తూర్పు నావికా దళంలో ఈ మధ్యాహ్నం జరిగే ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను జాతికి అంకితం చేస్తారు. ఈ కార్యక్రమంపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి మరిన్ని వివరాలను అందజేస్తారు.

**....వాయిస్ 40 సెకన్లు....**

-------------------------

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా జల్‌జీవన్ మిషన్‌ను మరింత బలోపేతం చేస్తామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వెల్లడించారు. విజయవాడలో జల్‌జీవన్ మిషన్ అమలుపై గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యశాలలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరికీ నీటి సరఫరా ఉండాలనే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ ప్రారంభమైందని అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేల కోట్ల రూపాయలను మంజూరు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరామని పవన్ కల్యాణ్ తెలుపుతూ....

**....వాయిస్ (27 సెకన్లు )....**

-------------------------

పదవ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల వివరాల నమోదులో తప్పుల సవరణకు రేపటి నుంచి ఈ నెల 23 వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల వివరాలను పాఠశాల రికార్డుల్లోను, అపార్ వివరాలతో సరిపోల్చి, తప్పులుంటే సవరించాలని సూచించింది. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, మాధ్యమం వంటి అంశాల్లో తప్పులు నమోదు చేసి ఉంటే వాటిని ఆన్‌లైన్లో ప్రధానోపాధ్యాయులు సరిచేయొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' మెనూను రాష్ట్ర ప్రభుత్వం జోన్లవారీగా మార్పు చేసిందని విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-1లో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉండగా.. జోన్-2లో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాలు ఉన్నాయి. జోన్-3లో ఉమ్మడి గుంటూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం ఉండగా.. జోన్-4లో ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు ఉన్నాయని తెలిపారు. ప్రాంతాలవారీగా విద్యార్థుల ఆహారపు అలవాట్లు, తినే ఆహారం ఆధారంగా ఈ మెనూ రూపొందించామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు పోషకాలు అందేలా మెనూని రూపొందించారని, సంక్రాంతి సెలవుల తర్వాత బడుల్లో దీనిని అమల్లోకి తీసుకువస్తామని అధికారులు వెల్లడించారు.

---------------------------

శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం మరో రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. కడప మీదుగా వెళ్లే విజయవాడ-కొల్లాం ప్రత్యేక రైలు ఈ నెల 21, 28 తేదీల్లో విజయవాడలో బయలుదేరుతుందని... తిరుగు ప్రయాణంలో ఈ రైలు డిసెంబరు 23, 30 తేదీల్లో కొల్లాంలో బయలుదేరుతుందని తెలిపింది. మరో ప్రత్యేక రైలు జనవరి 15, 22 తేదీల్లో నర్సాపూర్‌లో బయలుదేరుతుందని.. తిరుగు ప్రయాణంలో ఈ రైలు కొల్లాంలో జనవరి 17, 24 తేదీల్లో బయలుదేరి నర్సాపూర్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

---------------------------

ఈరోజు మైనారిటీ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. మతం, భాష, జాతీయత లేదా జాతి ప్రాతిపదికన ప్రపంచ వ్యాప్తంగా ప్రజలలో వివక్ష చూపడాన్ని వ్యతిరేకిస్తూ.. 1992 డిసెంబర్ 18న ఐక్యరాజ్య సమితి ఒక ప్రకటన చేసింది. మైనారిటీలకు చెందిన హక్కులను పరిరక్షించాలని సూచిస్తూ.. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా డిసెంబర్ 18న ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది.

---------------------------

విదేశాలకు వెళ్ళేవారు దళారుల వలన మోసపోవద్దని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన మహిళ గల్ఫ్ దేశమైన బెహరన్‌కు వెళ్ళి.. అక్కడి ఇబ్బందుల గురించి వీడియోను విడుదల చేసింది. ఆమెను ప్రభుత్వ సహాయంతో మంత్రి తిరిగి స్వస్థలానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.....

**...వాయిస్ (28 సెకన్లు)...**

---------------------------

ఆయుర్వేద ఔషధ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయుష్ విభాగం వైద్య అధికారి పి. జగదీష్ పేర్కొన్నారు. ఆయుష్ విభాగం

ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ రోజు ఆయుర్వేద ఔషధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ, భారతీయ ప్రాచీన సంస్కృతిలో ఆయుర్వేదం భాగమని అన్నారు. అన్ని రకాల వ్యాధుల నివారణకు ఆయుష్ శాఖలో ఔషధాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నెల 7 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 20వ తేదీన కృష్ణాజిల్లా పెనమలూరు మండలం గంగూరులో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గంగూరులో జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొంటారని అదే రోజు ముఖ్యమంత్రి స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సందర్శిస్తారని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ళు జరిగే మిల్లును ముఖ్యమంత్రి సందర్శించి రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

---------------------------

భవానీ దీక్ష విరమణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మిశ తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఏర్పాట్లను ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలినడకన వచ్చే భవానీలకు విశ్రాంతి స్థలాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు.

---------------------------

ఈ రోజు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పెరుగుతున్న వలసలను పరిగణలోకి తీసుకున్న ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ ఒక తీర్మానాన్ని చేసింది. వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యుల హక్కుల పరిరక్షణ కోసం 1990 డిసెంబర్ 18వ తేదీన ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా డిసెంబర్ 18న వలసదారుల దినోత్సవం పాటిస్తున్నారు.

=====================